
ప్రజాశక్తి
సోమవారం 8 జులై 2024
5
పార్వతీపురం మన్యం



పాలకొండలో కుండపోత వర్షం

ప్రజాశక్తి - పాలకొండ

పట్టణంలో ఆదివారం కుండపోత వర్షం కురిసింది. మధ్యాహ్నం 3గంటల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో ప్రజలు కొద్దిరోజులుగా ఎండ వేడికి ఇబ్బంది పడుతున్న వారికి ఉపశమనం లభించింది.

సీతంపేట : సీతంపేట ఏజెన్సీలో ఆదివారం మధ్యాహ్నంకొద్దిపాటి వర్షం కురిసింది. అయితే రైతులు భారీ వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. ఈ తరుణంలో కొద్దిపాటి వర్షం కురవడంతో రైతులకు కొంత ఊరట లభించింది. అప్పటి వరకు ఎండ తీవ్రంగా ఉన్నప్పటికీ ఒకసారిగా వాతావరణం చల్లబడి ఒకసారి గా వర్షం కురిసింది.

ఇంటర్ పాఠ్యపుస్తకాలు అందేనా?

- ప్రతిపాదనలు పంపిన అధికారులు
- ఇంకా రాని పుస్తకాలు
- ఆందోళనలో ఇంటర్మీడియట్ విద్యార్థులు

ఉచిత పాఠ్య పుస్తకాల పంపిణీపై గత వైసిపి ప్రభుత్వం చేతులెత్తేసింది. రాష్ట్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పడ్డాక ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు అందిస్తామని విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ప్రకటించిన విషయం తెలిసిందే. అందుకు అనుగుణంగా ఇంటర్ బోర్డు నుంచి ప్రతిపాదనలు పంపించాలని ఆదేశాలు కూడా ఇచ్చారు. ప్రతిపాదనలు కూడా జిల్లా ఇంటర్ బోర్డు అధికారులు పంపించారు. విద్యాసంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా నేటికీ పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు అందలేదు. ఇంటర్ విద్యామండలి నిధులతో పాఠ్యపుస్తకాలను విద్యా సంవత్సరం ప్రారంభంలో పంపిణీ చేయాల్సి ఉంది. పుస్తకాల ముద్రణపై స్పష్టత కొరవడడంతో పుస్తకాలు వస్తాయా రావా అనే సందేహంలో విద్యార్థులు ఉన్నారు. పుస్తకాలు లేకుండా తమ పిల్లలు ఎలా చదువుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రుల ప్రశ్నిస్తున్నారు. వేల రూపాయలు వెచ్చించి బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేసే అవకాశం లేక ఇబ్బందులు పడుతున్నారు.

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉమ్మడి జిల్లాలో 18 ప్రభుత్వ కళాశాలలు, కెజిబివి, మోడల్ స్కూళ్ల నుంచి సుమారుగా 29 వేల మందికి పైగా ఇంటర్ జూనియర్ విద్యార్థులు ఉన్నారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మరో 20 వేల మందిపైగా చదువు తున్నారు. ప్రభుత్వం సకాలంలో పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయక పోవడంతో గతేడాది సీనియర్ల వద్ద సేకరించిన పుస్తకాలను జూనియర్లకు అందజేశారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో పాత పుస్తకాల ద్వారానే విద్యార్థులు పాఠ్యాంశాలను అభ్యసిస్తున్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ఎపిఆర్ఎ సి, కెజిబివి, ఎపి. మోడల్, సాంఘిక సంక్షేమ, ఎపి ట్రైబల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాలల ఉన్నాయి. ఆయా కళాశాలలో అభ్యసించే విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందించాల్సి ఉంది. జిల్లాల విభజన తర్వాత జూనియర్ కళాశాలలను (హైస్కూల్ ప్లస్) ఏర్పాటు చేశారు. అలా విజయనగరం జిల్లాలో మరో ఏడు కళాశాలలు ఏర్పడ్డాయి. వీటిలో చేరిన విద్యార్థులకు కూడా ఉచితంగా పుస్తకాలు అందించాల్సి ఉంది. దీనికితోడు జిల్లాలో ఇంటర్ బోర్డు గుర్తింపు ద్వారా నడుస్తున్న ప్రైవేట్ అన్ ఎయిడెడ్, ప్రైవేట్ ఒకేషనల్ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకూ పాఠ్యపుస్తకాలు ఇవ్వాల్సి ఉంది. ప్రభుత్వం పంపిణీ చేయకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడింది. పాఠ్య పుస్తకాలు నోటు పుస్తకాలు కలిపి విద్యార్థులకు సుమారు రూ. 2వేలు నుంచి 3 వేలకుపైగా ఖర్చవుతుంది.



ఇంటర్ విద్యపై ప్రభుత్వ నిర్లక్ష్యం

గత వైసిపి ప్రభుత్వం విద్యారంగంలో మార్పులు తీసుకొచ్చి అభివృద్ధికి యజ్ఞం చేస్తున్నామంటూ చేసిన ప్రకటనలు నేతిబీర చందంగా మారాయి. విద్యా దీవెన, అమ్మ ఒడి పథకాల పేరుతో నగదు అందజేస్తున్నామంటూ ప్రచారం చేసుకుంంతీ. విద్యార్థుల అభ్యసనలో కీలకమైన పాఠ్యపుస్తకాలు అందజేయడంలో మాత్రం తీవ్రమైన నిర్లక్ష్యాన్ని ప్రదర్శించింది. గత అనుభవాల నుంచి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించేందుకు నూతన ప్రభుత్వం చొరవ చూపించాల్సి ఉంది.

మధ్యాహ్న బోజన పథకం అమలేదీ?

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన సదుపాయం కల్పిస్తామని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి ప్రకటించడంతో విద్యార్థుల్లో ఆనందం వ్యక్తమైంది. అయితే రెండు నెలలు అవుతున్నా ఇంత వరకు ఎటువంటి ఆదేశాలూ రాకపోవడంతో మధ్యాహ్న బోజన పథకం అమలు జరుగుతుందా లేదా అనేది సందిగ్ధంగానే ఉంది. మధ్యాహ్న భోజనం పథకం అమలు చేస్తే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరే విద్యార్థుల సంఖ్య కూడా పెరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నుంచి ఎటువంటి నిర్ణయం వస్తుందోనని విద్యార్థులు ఎదురు చూస్తున్నారు.

పాఠ్య పుస్తకాలు అందించాలి

రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు అందిస్తామని చెప్పి నేటికీ ఇవ్వలేదు. వెంటనే పంపిణీ చేయాలి. పేద విద్యార్థులు వేల రూపాయలు పెట్టి ఎలా కొనగలరు.? పాఠ్య పుస్తకాలు లేకపోవడం వల్ల విద్యార్థుల చదువుకు ఆటంకంగా ఉంది. వెంటనే పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయాలి.

– డి.పండు, ఎస్ఎఫ్ఐ మన్యం జిల్లా కార్యదర్శి.

జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్



కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న శ్యామ్‌ప్రసాద్

జిల్లా సర్వతో ముఖాభివృద్ధికి కృషి చేస్తానని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. నూతన జిల్లా కలెక్టర్‌గా ఆదివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లాకు రెండో కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఉత్తరాంధ్రలో మన్యం జిల్లా బాగా వెనుకబడిన ప్రాంతమన్నారు. జిల్లా పరిధిలో రెండు ఐటిడిఎ ప్రాజెక్ట్‌లున్నాయని, గతంలో శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో పనిచేసినందున పూర్తి అవగాహన తనకు ఉందని తెలిపారు. జిల్లాలో గిరిజన సంక్షేమాభివృద్ధికి, విద్యా, వైద్య రంగాల బలోపేతం, మాలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక దృష్టి సారించనున్నామన్నారు. క్షేత్ర స్థాయిలో పర్యటించి పాలనపై త్వరగా పట్టుసాధిస్తానని స్పష్టం చేశారు. మన్యం జిల్లాలో అభివృద్ధి పనులకు ఎటువంటి ఆటంకాలు లేకుండా సత్వరం పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. జిల్లాను ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి పథంలో నడిపిస్తానని తెలిపారు. ప్రజలకు మరింత చేరువగా ఉండి సేవలందించాలన్న సంకల్పంతో ముందుకు వెళ్తామని వెల్లడించారు. అలాగే జిల్లా అభివృద్ధిలో అధికారులు, స్వచ్ఛంద సంస్థలు తమవంతు సహాయ సహకారాలు అందించాలని కలెక్టర్ సూచించారు. అనంతరం జిల్లా అధికారులు మర్యాదపూర్వకంగా కలుసుకొని దుస్సాలువతో సన్మానించి పుష్పగుచ్ఛాలు అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, ఐటిడిఎ పిఒ సి.విష్ణు చరణ్, ఆర్‌డిఒ కె.హేమలత, డిఆర్ఒ జి.కేశవ నాయుడు. కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా అధ్యక్షులు మండంగి హరినాథ్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో సిఐటియు జిల్లా కోశాధికారి జి.వెంకటరమణతో కలిసి విలేకరులతో ఆయన మాట్లాడారు. ఫీల్డ్ అసిస్టెంట్లపై జరుగుతున్న దారుణాలను అరికట్టాలన్నారు. ప్రభుత్వం మారినప్పుడల్లా ఫీల్డ్ అసిస్టెంట్లపై లేనిపోని ఆరోపణలు చేసి నిర్బంధ ఉద్యోగ విరమణ చేయించే కుట్రలు జరుగుతున్నాయన్నారు. వీటన్నింటినీ నిరసిస్తూ సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిని అందించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని ఫీల్డ్ అసిస్టెంట్లంతా హాజరు కావాలని కోరారు.

త్వరలో పూర్ణపాడు-లాబేసు వంతెన పూర్తి

మండలంలో ఎమ్మెల్యే జగదీశ్వరి విస్తృత పర్యటన

ప్రజాశక్తి - కొమరాడ

నియోజవర్గంలో దీర్ఘకాల సమస్యగా ఉన్న పూర్ణపాడు లాబేసు వంతెన 2014లో టిడిపి ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభమయ్యాయని, తిరిగి వంతెనను తమ ప్రభుత్వ హయాంలోనే పూర్తి చేస్తామని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని నాగావళి నది ఆవల గల గ్రామాల్లో ఎమ్మెల్యే ఆదివారం సుడిగాలి పర్యటన చేశారు. ముందుగా గుణదతీలేసులో మండల టిడిపి అధ్యక్షులు శేఖర్ పాత్రుడు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జగదీశ్వరి సచివాలయం, రైతు భరోసా కేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి పూర్తి ప్రాధాన్యతనిస్తూ పాలనను కొనసాగిస్తానని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ముందుగా పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి వీరేష్ దేవ్ మాట్లాడుతూ తమ ప్రభుత్వంతో నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివద్ధి చేసి సమస్యల్లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గిరిజన ప్రాంతాల్లో రోడ్లు, తాగునీరు, విద్య, వైద్యం వంటి సదుపాయాల కల్పనకు శత శాతం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మధ్యలో నిలిచిపోయిన నియోజకవర్గ ప్రధాన సమస్యగా ఉన్న పూర్ణపాడు –లాబేసు వంతెనను టిడిపి నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు వంతెన పరిస్థితిని ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వంతెన పూర్తికి సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ దృష్టిలో పెట్టి నిధులు మంజూరు చేసి మళ్లీ పనులను త్వరలో ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. వైసిపి హయాంలో కనీసం వంతెన పనులు చేయకపోవడం దురదృష్టకరమన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ మల్లికార్జునరావు, ఎఒ శంకరరావు, రాష్ట్ర టిడిపి కార్యదర్శి గులిపిలి సుదర్శన్‌రావు, నాయకులు నంగిరెడ్డి మధుసూదనరావు, దేవకోట వెంకటనాయుడు, గొట్టాపు త్రినాధ రావు, నియోజకవర్గ జనసేన సమన్వయకర్త కడ్రక మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది పని తీరుపై ఆగ్రహం వ్యక్తం

పిహెచ్‌సిల్లో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే జగదీశ్వరి అన్నారు. మండలంలోని తన పర్యటనలో భాగంగా మాదలింగి పిహెచ్‌సిని ఆకస్మికంగా తనిఖీ చేశారు.



మాదలింగి పిహెచ్‌సిలో రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

తనిఖీ సమయంలో వైద్యులు, సిబ్బంది ఆస్పత్రిలో లేకపోవడంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే సమయంలో లివర్ సమస్యతో బాధపడుతున్న రోగి ఆసుపత్రికి వచ్చి వైద్యం కోసం ఎదురుచూస్తున్నారు. అప్పటికే ఆసుపత్రిలో ఒక్క స్టాఫ్ నర్స్ మాత్రమే ఉండడంతో ఆమె ఎటువంటి చికిత్స అందించే పరిస్థితి లేకపోవడంతో జిల్లా ఆసుపత్రికి రిఫర్ చేసినట్లు ఆమె దృష్టికి వచ్చింది. అనంతరం ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలను స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ పిహెచ్‌సిలో వైద్యులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. ఆసుపత్రి విసిటింగ్ రికార్డులో వైద్యులు పనితీరు సరిగ్గా లేదని ఆమె రికార్డులో రాశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. రికార్డులో కనీసం సంతకాలు కూడా చేయలేని పరిస్థితిలో వైద్య సిబ్బంది ఉండడం సమంజసం కాదని హెచ్చరించారు. ఇకనైనా వైద్య సిబ్బంది తమ తీరును మార్చుకొని ప్రజలకు సకాలంలో వైద్య సేవలందించాలన్నారు. ప్రజలకు వైద్య సేవలు అందించే విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డిమాండ్స్ డేను విజయవంతం చేయండి


ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

కొత్తగా వచ్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాపాడాలని కోరుతూ ఈనెల 10ననిర్వహించే కార్మికుల డిమాండ్స్ డే ను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు కోరారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన కార్మిక సంఘాల విస్తృతస్థాయి సమావేశంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు జరిగి రాష్ట్రం, కేంద్రంలో కొత్త ప్రభుత్వాలు ఏర్పడ్డాయన్నారు. గత ప్రభుత్వాలు కార్మికులకు వ్యతిరేకంగా కార్పొరేట్లకు, బడా పెట్టుబడిదారులకు అనుకూలంగా పనిచేయడంతో ఆ ప్రభుత్వాలకు ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. పోరాడి సాధించిన లేబర్ కోడ్‌లను నాలుగేళ్లుగా అమలు చేయకుండగా కొత్త ప్రభుత్వం అమలుకు మళ్లీ సిద్ధమవుతుందన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న పిఎఫ్‌ను అన్ని రంగాలకు ప్రభుత్వాలు, యజమాలు చిత్తశుద్ధిగా అమలు చేయడంలేదని విమర్శించారు. కార్మికులకు ఉన్న హక్కులను తొలగించి, పని గంటలు పెంచడం, జీతాల్లో కోత పెట్టడం, నిర్బంధం, రాజకీయ వేధింపులు తీవ్రతరం చేయడం సరైంది కాదని అన్నారు. తక్షణమే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, పెరిగిన ధరల కనుగుణంగా కనీస వేతనాలు పెంచాలని, స్టీల్ ప్లాంట్, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, స్కీమ్ వర్కర్లు ఆశా, అంగన్వాడీ, మధ్యాహ్నం భోజనం, హెల్త్ మిషన్ సమగ్ర శిక్షణ, వెలుగు, ఉపాధి, 108, 104, ప్రభుత్వ కార్మికులుగా గుర్తించాలని, కాంట్రాక్టు ఔట్సోర్సింగ్, కంటింజెంట్ పార్ట్ టైం తదితర రంగాల వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని, కొత్త పెన్షన్ స్కీము రద్దు చేయాలని, పాత పెన్షన్ స్కీము అమలు చేయాలని, గ్రీన్ అంబాసిడర్లకు బకాయి జీతాలు పాత పద్ధతిలో చెల్లించాలని, అన్ని రంగాల కార్మికులు, బకాయి జీతాలు చెల్లించాలి ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ హక్కులు సాధించడం కోసం ఈనెల 10న తలపెట్టిన డిమాండ్స్ డే సందర్భంగా ఉదయం కలెక్టర్ ఆఫీస్ వద్ద, సాయంత్రం అన్ని మండలాల్లో నిరసన ధర్నాలు, ర్యాలీలు చేపట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిఐటియు జిల్లా కోశాధికారి జివి రమణ, జిల్లా కమిటీ సభ్యులు బి.సూరిబాబు, ఎం.శివాని, మామిడి శివ, జి.కృష్ణ తోపాటు మున్సిపల్ ఆశ మధ్యాహ్నం సిహెచ్ డబ్ల్యూ గ్యాస్, రైస్ మిల్లు తదితర సంఘాలు నాయకులు మండంగి హరినాథ్, జి.దమయంతి, శనపతి గౌరమ్మ, సిహెచ్. మురళి, బి.వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.



కార్మికుల డిమాండ్స్‌డే కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు, స్కీం వర్కర్లు

కొమరాడ : జూలై 10న కార్మిక డిమాండ్స్ డేను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిరా పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ కార్మిక సమస్యల పరిష్కారం కోరుతూ సిఐటియు ఈనెల 10న దేశవ్యాప్తంగా డిమాండ్స్ డేను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ముందు ఉంచాలని నిర్ణయం చేసిందన్నారు. కావున ఆరోజున మండలంలోని అన్ని రంగాల కార్మికులు, స్కీమ్ వర్కర్లు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొని తమ నిరసన తెలపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంగన్వాడీ ప్రాజెక్టు లీడర్ సిహెచ్ అనురాధ, ఆశా వర్కర్ల మండల యూనియన్ నాయకులు ఆర్.రాజేశ్వరి, సిహెచ్‌డబ్ల్యూ నాయకులు దుర్గా భవని, కార్మిక సంఘ నాయకులు హిమరిక గౌరు నాయుడు, ఎపి గిరిజన సంఘ నాయకులు రామారావు వెంకటేష్, మంగ, ఆరుద్ర సుజాత పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు, కవులు

'తప్పెవరిది?' బాలల కథా సంపుటి ఆవిష్కరణ

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

నాణ్యమైన బాలసాహిత్యానికి కేరాఫ్ అడ్రస్ నారంశెట్టి, పిల్లల హృదయాలను అలరించే చక్కని సందేశాత్మక బాల సాహిత్యం రాయడంలో ఆయన దిట్ట అని జట్టు వ్యవస్థాపకులు డాక్టర్ డి.పారినాయుడు అన్నారు. ఆదివారం స్థానిక జట్టు సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ బాల సాహితీవేత్త, కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కార గ్రహీత నారంశెట్టి ఉమామహేశ్వరరావు రచించిన 'తప్పెవరిది' బాలల కథా సంపుటిని ఆయన ఆవిష్కరించారు. ఆ సందర్భంగా మాట్లాడుతూ బాలసాహిత్య పుస్తకాలను ప్రభుత్వమే కొనుగోలు చేసి పాఠశాలలకు, గ్రంథాలయాలకు సరఫరా చేసినప్పుడే పిల్లలకు మంచి అలవాట్లు, లక్షణాలు అలవడతాయని, అప్పుడే భావితరాలు బాగుంటాయని పారినాయుడు అన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కార గ్రహీత బెలగాం భీమేశ్వరరావు మాట్లాడుతూ నారంశెట్టి రచనలు పిల్లల మనసుల్ని దోచుకునేలా ఉంటాయని, అందుకే ఆయన ద్వారా పార్వతీపురానికి కేంద్ర సాహిత్య అకాడమి పురస్కారం వచ్చిందని అన్నారు. పార్వతీపురంలో బాలసాహిత్య సృజన ఎక్కువ ఉండడం వల్లే ఇప్పటికి రెండు కేంద్రసాహిత్య పురస్కారాలు తనతో సహా వచ్చాయని అన్నారు. పెద్దలు, గురువులు తప్పక తమ పిల్లలచే బాల సాహిత్యాన్ని చదివించాలని పిలుపునిచ్చారు. పుస్తక రచయిత నారంశెట్టి మాట్లాడుతూ తన రచనలను హైదరాబాదుకు చెందిన నవచేతన పబ్లికేషన్స్ వారు 'తప్పెవరిది' పేరుతో ప్రచురించడం, దాన్ని జట్టు కార్యాలయంలో ఆవిష్కరించడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ కథలను పిల్లలు చదివి ప్రయోజనం పొందాలని చెప్పారు. ఇది తన 32వ పుస్తకమని, ఇంకా చాలా పుస్తకాలు ముద్రణ కావాల్సి ఉందని తెలిపారు. కార్యక్రమంలో నటుడు, రచయిత రౌతు వాసుదేవరావు, బాలసాహితీవేత్త బెహరా ఉమామహేశ్వరరావు, చిత్రకారుడు తుంబలి శివాజీ, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు, వ్యవసాయ పుస్తకాల రచయిత టి.శివకేశవరావు, అల్లువాడ కైలాసరావు, పక్కి రవీంద్రనాథ్, పి.గౌరీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జగన్నాథ రథయాత్ర ప్రారంభం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణంలో ఆదివారం స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర, మున్సిపల్ ఛైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి ఆధ్వర్యంలో ఘనంగా జగన్నాథస్వామి రథయాత్ర ప్రారంభమైంది. జగన్నాథ స్వామి ఆలయంలోని జగన్నాథ స్వామి, బలరామస్వామి, సుభద్రదేవి విగ్రహాలను ఒడియా బ్రాహ్మణులతో కలిసి రథం మీద ఉంచి ఎమ్మెల్యే పూజ నిర్వహించారు. పూజల అనంతరం భక్తులు జగన్నాథస్వామిని దర్శించుకున్నారు. అనంతరం పక్కన ఒరియా బ్రాహ్మణుల మేళాలు, ఒరిస్సాలోని రాయగడ జిల్లా చోరుపల్లి నుండి వచ్చిన ప్రత్యేక భజన బృందం, పట్టణంలో వివేకానంద కాలనీకి చెందిన మహిళల కోలాటంతో పాత బస్టాండ్ నుండి ప్లైఓవర్ దగ్గర ఉన్న గుడించా మండపంలో విగ్రహాలను ఉంచి పూజలు నిర్వహించారు. గుడించా మండపంలో ఉన్న విగ్రహాలకు ఒరియా పురోహితులు 9 రోజులు 9 అవతారాలతో అలంకరించి పూజలు నిర్వహిస్తారు. కార్యక్రమంలో అత్యధిక సంఖ్యలో పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

ఎమ్మార్ నగరంలో....

పార్వతీపురం రూరల్ : మండలంలోని ఎంఆర్ నగరంలో జగన్నాథ రథయాత్ర ఘనంగా నిర్వహించారు. కొత్తగా తయారు చేసిన రథంపై బలరామ సుభద్ర జగన్నాథుని విగ్రహాలను మేళ తాళాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి, రథంపై కూర్చోబెట్టి గ్రామ శివారులోని గుండి మందిరం తీసుకుని పండగ నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రూరల్ ఎస్సై దినకర్ బందోబస్తు నిర్వహించారు.



జగన్నాథ స్వామికి పూజలు చేస్తున్న మంత్రి సంధ్యారాణి



పార్వతీపురంలో ప్రారంభమైన జగన్నాథస్వామి రథయాత్ర

జగన్నాథ స్వామిని దర్శించుకున్న మంత్రి

సాలూరు: జగన్నాథ స్వామి రథయాత్ర సందర్భంగా ఆదివారం గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి కోట వీధిలో ఉన్న జగన్నాథ స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆమెకు ఆలయ అర్చకులు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్‌దేవ్ కూడా పూజల్లో పాల్గొన్నారు. రథాన్ని ఊరేగింపుగా ప్రధాన రహదారి మీదుగా తీసుకెళ్తారు.భక్తులు అధికసంఖ్యలో పూజలు చేస్తారు.

జగన్నాథ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

పాలకొండ : జగన్నాథ స్వామి ఉత్సవాలు ప్రారంభం కావడంతో స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయక్రిష్ణ దర్శించుకున్నారు. ఆలయ ఇఒ సర్వేశ్వరరావు ఆయన్ను సాధనంగా ఆహ్వానించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈయనతో పాటు పట్టణ, మండల టిడిపి అధ్యక్షులు జి.సంతోష్ కుమార్, జి.రామినాయుడు, సుంకరి అనిల్, సంఘం నాయుడు, తదితరులు ఉన్నారు.

వీరఘట్టం : మండలంలోని రథయాత్ర ఘనంగా ప్రారంభమైంది. ముందుగా వీరఘట్టం మందిర వీధిలో గల జగన్నాథ ఆలయంలో బల భద్ర సుభద్ర, జగన్నాథంకు ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహాలను రథం మీదకు ఎక్కించి ప్రధాన రహదారి మీదుగా ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద గల గుండుసా మందిరానికి తరలించారు.



క్రీడాకారులకు ట్రోఫీని అందజేస్తున్న మంత్రి సంధ్యారాణి

టోర్నమెంట్ విజేతలకు బహుమతి ప్రదానం


ప్రజాశక్తి -సాలూరు

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన టిడిపి ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్ ముగింపు సందర్భంగా విజేతలకు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి ఆదివారం సాయంత్రం బహుమతి ప్రధానం చేశారు. టోర్నమెంట్ విజేత బొబ్బిలి జట్టుకు రూ.30వేల నగదు, ట్రోఫీ అందజేశారు. రెండో స్థానంలో నిలిచిన సాలూరు జట్టుకు రూ.15వేల నగదు, ట్రోఫీ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడల్లో రాణించిన యువతకు ఉజ్వల భవిష్యత్తు వుంటుందని చెప్పారు. అనంతరం విజేతలను అభినందించారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, మండల అధ్యక్షుడు ఆముదాల పరమేష్, పట్టణ సీనియర్ నాయకులు కొనిసి చిన్ని పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి

ప్రజాశక్తి - సాలూరు

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎపి యునైటెడ్ విలేజ్ అండ్ వార్డ్ హెల్త్ సెక్రటరీ వెల్ఫేర్ అసోసియేషన్ మన్యం జిల్లా నాయకులు ఆదివారం గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణిని కలిసి వినతిపత్రం అందజేశారు. అసోషియేషన్ నాయకులు బి.రమాదేవి, బి.శైలజ, పి.రమణమ్మ, కె.శ్రీలక్ష్మీ మంత్రి సంధ్యారాణిని ఆమె నివాసంలో కలిసి సమస్యల్ని పరిష్కరించాలని కోరారు. హెల్త్ సెక్రటరీలను వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోకి తీసుకొస్తూ జారీ చేసిన ఉత్తర్వులను అమలు చేయాలని కోరారు. ఎంపిహెచ్ఎ (ఫిమేల్)గా పదోన్నతి కల్పించాలని కోరారు. సెలవులు తీసుకునేటప్పుడు పంచాయతీ రాజ్, వైద్య ఆరోగ్య శాఖల నుంచి అనుమతి తీసుకోవాల్సి వస్తుందని, అలా కాకుండా వైద్య ఆరోగ్య శాఖ నుంచి అనుమతి పొందేలా చూడాలన్నారు. నిర్దేశించిన విధులు కాకుండా ఇతర శాఖల విధులు నిర్వహించకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు పాల్గొన్నారు.



సుధాకర్‌కుమార్‌ను సత్కరిస్తున్న సాహితీవేత్తలు

అలరించిన సాహితీ సదస్సు

ప్రజాశక్తి -సాలూరు

పట్టణంలోని లయన్స్ క్లబ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఆదివారం సాలూరు సాహితీ మిత్రబృందం ఆధ్వర్యాన నిర్వహించిన 88వ సాహితీ కార్యక్రమం అలరించింది. మిత్రబృందం అధ్యక్షులు రావాడ కృష్ణకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్వతీపురం పట్టణానికి చెందిన డాక్టర్ పొందూరు సుధాకుమార్ భాగవతం చదివితే బాగవుతాం అన్న అంశంపై ప్రసంగించారు. భాగవతంలోని పలు ఘట్టాలను వివరిస్తూ అలరించారు. గయోపాఖ్యానం, కుచేలోపాఖ్యానం వంటి ఘట్టాలను ప్రస్తుత పరిస్థితులకు అన్వయిస్తూ ప్రసంగించారు. లయన్స్ క్లబ్ పూర్వ అధ్యక్షులు కర్రి వెంకట్రావు, కూనిశెట్టి భీమారావు మాట్లాడుతూ భాగవతం పఠనం వల్ల గొప్ప గొప్ప విజయాలు తెలుస్తాయని చెప్పారు. మిత్రబృందం వ్యవస్థాపక అధ్యక్షులు జెబి తిరుమలాచార్యులు, సభ్యులు షావుకారు చంద్రశేఖర్, శేషాద్రి సోమయాజులు, ఆకుల గణపతిరావు, గౌరీశంకర్ పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

విద్యా వ్యవస్థపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - సీతానగరం

విద్యా వ్యవస్థపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర అన్నారు. మండలంలోని జోగింపేట స్కూల్ ఆఫ్ ఎక్సెలెన్స్ పాఠశాలను ఆదివారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ విద్యా ప్రమాణాలను మెరుగుపర్చాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతి విద్యార్థి లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. విద్యాబోధన, మౌలిక సౌకర్యాలు తదితర అంశాలను పరిశీలించారు. ఈ పరిశీలనలో టిడిపి నాయకులు బొమ్మినాయుని లక్ష్మణ రావు, సీతారాం, వేణు, కార్యకర్తలు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు

ఆ బస్సులను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - మక్కువ

మక్కువ మండల కేంద్రం నుంచి గతంలో ఆర్‌టిసి నడిపే రావులపాలెం, విశాఖ బస్సు సర్వీసులను వెంటనే పునరుద్ధరించాలని మండల ప్రజలు కోరుతున్నారు. మక్కువ, దుగ్గేరు నుంచి ప్రతిరోజు ఉదయం 5గంట, 7గంటల సమయాల్లో ఆ బస్సులను నడిపేవారని, దీంతో సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు, ఆసుపత్రులకు వెళ్లే రోగగ్రస్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేదని స్థానికులు అంటున్నారు. అలాగే బొబ్బిలి మీదుగా రాత్రి సమయంలో విశాఖ బస్సు నడపడం వల్ల మక్కువ, సీతానగరం మండలాల ప్రజలకు ఎంతో ప్రయోజనం ఉండేదని వారు తెలిపారు. అలాగే దుగ్గేరు నుండి రావులపాలెం వెళ్లే బస్సు దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేదని ఈ బస్సు సర్వీసులను నిలిపివేయడంతో గిరిజన ప్రాంతానికి చెందిన ప్రజలు అనేక అవస్థలకు గురవుతున్నారని వాపోతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులపై స్థానిక ప్రజాప్రతినిధులు ఒత్తిడి తెచ్చి తిరిగి ఈ బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు.

కరుగుతున్న కంకర

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కిమ్మీ రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేసిన కంకర కరుగుతుంది. అప్పుడప్పుడు కురుస్తున్న వర్షాలకు వేసిన కంకర కరిగిపోవడంతో పెద్ద గోతులు ఏర్పడ్డాయి. దీంతో బిటి రహదారి పాడయ్యే పరిస్థితి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాగే విడిచిపెట్టిస్తే రహదారి పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉందని, వీటిపై రోడ్లు, భవనాల శాఖ అధికారులు దృష్టి సారించి, చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

కారు ఢీకొని వ్యక్తికి గాయాలైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే పార్వతీపురం కొత్తవలసకు చెందిన పట్నాన్ కుమార్ తన కుటుంబ సభ్యులతో కలిసి పాత బస్టాండ్‌లో జరుగుతున్న రథయాత్ర చూసి తిరిగి ఇంటికి వెళ్తుండగా స్కూటీలో పెట్రోల్ అయిపోయినది. తిరిగిపెట్రోల్ వేయించేందుకు ఫ్లైఓవర్ బ్రిడ్జి పైకి ఎక్కుతుండగా వెనుక నుండి వస్తున్న కారు ఢీకొంది. దీంతో కుమార్‌కు తీవ్ర గాయాలవ్వగా, అతని కుమారునికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన కుమార్‌ను జిల్లా ఆసుపత్రికి తరలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాణ్యమైన ఆహారం అందించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

హాస్టళ్లలో చిన్నారులకు నాణ్యమైన ఆహారం అందించాలని జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఆదివారం స్థానిక సాయి నగర్ కాలనీలోని ఏకలవ్య మోడల్ రిసెడెన్స్ స్కూల్, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల వసతి గృహాలను ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. కలెక్టర్‌గా విధుల్లో చేరిన రోజే ఆశ్రమ పాఠశాల నిర్వహణపై దృష్టి సారించారు. విద్యార్థులకు వండిన వంటకాలను రుచి చూశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం అందుతున్నదీ లేనిదీ ఆరా తీశారు. వంటకాల్లో రాజీ పడకుండా విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాల్సిందేనని అన్నారు. వసతి గృహాల బయట అపరిశుభ్రంగా ఉన్న పరిసరాలను పరిశీలించి అందుగల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అవసరమైన డస్ట్ బిన్ లను ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యార్థుల స్టడీ హవర్ ల నిర్వహణను, తరగతుల బోధన విషయాలను ప్రధానోపాధ్యాయులను అడిగారు. విద్యార్థుల పడకకు దుప్పట్లు ఉన్నవి లేనివి పరిశీలించారు. విద్యార్థుల ఆహార పదార్థాలు తినే ముందు చేతులను శుభ్రంగా కడుక్కొనేలా అవగాహన కల్పించాలని అన్నారు. రన్నింగ్ వాటర్ తాగునీటి సౌకర్యాలను నిశితంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తొలుత విద్యార్థులతో మాట్లాడుతూ నిరంతర సాధనతో విద్యను అభ్యసించి ఉత్తమ ఫలితాలు సాధించాలని వారిలో ఉత్తేజాన్ని నింపారు. విద్య తోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని పేర్కొన్నారు.



భోజనం నాణ్యతను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ఆశ్రమ పాఠశాల వార్డెన్ కు షోకాజ్ నోటీస్

వసతు గృహాలను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించిన సమయంలో డిప్యూటీ వార్డెన్ చిరంజీవి నాయక్ వసతి గృహంలో లేకపోవడం గమనించి తక్షణమే షోకాజ్ నోటీసును జారీ చేయాలని గిరిజన సంక్షేమ అధికారి ఎం.రుక్మందరావును ఆదేశించారు. వసతి గృహాల్లో అందరూ సమయపాలన పాటించాలని ఏ ఒక్కరూ. నిర్లక్ష్యం చూపిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కలెక్టర్ వెంట ఏకలవ్య మోడల్ రిసెడెన్స్ స్కూల్ ప్రిన్సిపాల్ బి వి ప్రసాద్ పట్నాయక్, ప్రధానోపాధ్యాయులు చిన్నమోహన్ రాయుడు, ఆయాలు, వసతి గృహాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మన్యంలో మౌలిక వసతులు

హామీలన్నింటినీ నెరవేరుస్తా

కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం



గిరిజన ప్రాంతంలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తానని కురుపాం నియోజకవర్గ ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు. ఏజెన్సీలో గిరిజనుల సమస్యలపై దృష్టి సారించి ఎప్పటికప్పుడు స్పందిస్తూ పరిష్కారానికి, గిరిజన ప్రాంత అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. తన జన్మదినం సందర్భంగా ప్రజాశక్తికి ఇంటర్వ్యూ ఇచ్చారు. విశేషాలు ఆమె మాటల్లోనే..

ఒక సామాన్య గిరిజన మహిళ అయినా నన్ను ఈ ప్రాంత గిరిజనులు ఆదరించి, ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపించడం చాలా సంతోషంగా ఉంది. ఒక గిరిజన బిడ్డగా తోటి గిరిజనులు పడుతున్న కష్టాలు, బాధలు స్వయంగా చూశాను. వారి సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తాను. గిరిజన ప్రాంతాల్లో కనీస అవసరాలైన తాగునీరు, విద్య, వైద్యం, రహదారులు, జీవనోపాధి, పోడు భూముల పట్టాలు వంటి అనేక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాను. ముఖ్యంగా ఏజెన్సీలో విద్యా అవకాశాలు మెరుగుపరుస్తాను. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనా చర్యలు చేపడతాను. గిరిజనులు పండించే పంటలకు మద్దతు ధర కల్పించే దిశగా చర్యలు తీసుకుంటాను. నియోజకవర్గంలోని పెండింగ్‌లో ఉన్న పూర్ణపాడు లాబేసు వంతెన నిర్మాణానికి కృషి చేస్తా. ఏజెన్సీలో ఉన్న చిన్న చిన్న గెడ్డలపై చెక్ డ్యాములు నిర్మాణానికి ప్రాధాన్యత ఇచ్చి పంట పొలాలకు సాగునీరందిస్తా. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి గిరిజన కుటుంబానికి అందేలా చర్యలు తీసుకుంటాం. గిరి శిఖర గ్రామాలకు రహదారులు నిర్మించి మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా చర్యలు తీసుకుంటాను.గిరిజనుల డోలీల కష్టాలు లేకుండా చేస్తాను. గిరిజనులకు స్వచ్ఛమైన తాగునీరందించే దిశగా కృషి చేస్తాను. దీర్ఘకాలికంగా ఉన్న అడవి ఏనుగుల సమస్య పరిష్కారానికి కృషిచేసి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పిస్తాం. ఐటిడిఎ ద్వారా ట్రైకార్ రుణాలు గిరిజనులకు అందేలా కృషి చేస్తా. గిరిజన సంక్షేమ పాఠశాలలు, వసతి గృహాల్లో అన్ని మౌలిక వసతులు కల్పిస్తాం. మెరుగైన వైద్య సేవలందించి వ్యాధులు బారిన పడకుండా చర్యలు తీసుకుంటాను. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు, పింఛన్ల మంజూరుకు కృషి చేస్తాను. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన అందిస్తాను.

తాడికొండ టు అమరావతి

టిడిపి నుంచి తొలి మహిళా ఎమ్మెల్యే జగదీశ్వరి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మన్యం జిల్లాలోని కురుపాం నియోజకవర్గంలో గుమ్మలక్ష్మీపురం మండలం మారుమూల ప్రాంతం. ఆ ప్రాంతంలోని తాడికొండ గ్రామం నుంచి ఒక సాధారణ మహిళగా తోయక జగదీశ్వరి తొలి మహిళా ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2024 ఎన్నికల్లో టిడిపి నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా పోటీ చేసిన ఆమె ప్రత్యర్థి వైసిపి అభ్యర్థి పాముల పుష్పశ్రీవాణిపై 21926 ఓట్ల మెజార్టీతో ఘనవిజయం సాధించి తాడికొండ టు అమరావతి (వయా గుమ్మలక్ష్మీపురం) తొలిసారి అసెంబ్లీలో అడుగుపెట్టారు. మంచి వ్యక్తిగా, కష్టపడే మనస్తత్వం కలిగి ఉన్న నాయకురాలిగా ప్రజల్లో అభిమానం, పార్టీలో మంచి పేరు తెచ్చుకున్నారు. 2006, 2021లో ఎల్విన్‌పేట ఎంపిటిసిగా ఎన్నికయ్యారు. తెలుగు మహిళా మండల అధ్యక్షులు, ఎస్టీ సెల్ అధ్యక్షులు, అరకు పార్లమెంట్ కార్యనిర్వహణ కార్యదర్శిగా పనిచేశారు. ఆమె భర్త అడ్డాకుల సన్యాసినాయుడు ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్నారు. భర్త సన్యాసినాయుడుతో వివాహం తర్వాత అడ్డాకుల వారి కోడలుగా ఇటు అత్తమామలకు అటు తల్లిదండ్రులకు మంచి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే జగదీశ్వరి ముత్తాత అడ్డాకుల లక్ష్మణ్ నాయుడు 1955, 62లో కాంగ్రెస్ తరపున పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొంది ఈ ప్రాంతం నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడుగుపెట్టారు. మామ అడ్డాకుల గుండు నాయుడు 1987లో సమితి అధ్యక్షులుగా పని చేశారు. ఆనాటి వారసత్వం కుటుంబ రాజకీయాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు గా కొనసాగుతూ వస్తున్నారు.

వైఎస్ఆర్ జయంతి వేడుకల్లో పాల్గొనాలి

ప్రజాశక్తి - సాలూరు

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా పట్టణంలో సోమవారం నిర్వహించనున్న కార్యక్రమానికి నియోజకవర్గ, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని మాజీ డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర ఒక ప్రకటనలో కోరారు. పట్టణంలోని బోసు బొమ్మ జంక్షన్ వద్ద ఉదయం 10.30 గంటలకు జరగనున్న కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని ఆయన కోరారు.

భామిని : మండలంలోని కొరమ కూడలి వైఎస్ఆర్ విగ్రహం వద్ద వైఎస్ఆర్ జయంతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల వైసిపి కన్వీనర్ తోట సింహాచలం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వైసిపి ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

విద్యార్థులను బలవంతంగా తరలించడం ఆపాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

గిరిజన సంక్షేమ శాఖ కు చెందిన జిపిఎస్ పాఠశాలల్లోని 3,4,5 తరగతుల విద్యార్థులను బలవంతంగా తరలించడం మానుకోవాలని యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్రను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ప్రకారం విద్యార్థి తనకు నచ్చిన పాఠశాలలో చదువుకొనే హక్కు ఉందన్నారు. కానీ గిరిజన సంక్షేమ అధికారులు తల్లిదండ్రులను బలవంతంగా ఒప్పించి సమావేశాలు పెట్టి తరలిస్తున్నారన్నారు. అలాగే జిపిఎస్ పాఠశాలల్లో ఒక్కరే ఉపాధ్యాయులుంటారని, దీనివల్ల విద్యార్థులకు చదువురాదని తప్పుడు ప్రచారం చేసి విద్యార్థులను తరలిస్తున్నారని అన్నారు. తరలించని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామని అధికారులు బెదిరిస్తున్నారన్నారు. ఎంపిపి ఎస్ ఇతర మేనేజ్మెంట్లలో కూడా ఒక్కరే పని చేస్తున్న పాఠశాలలు ఉన్నాయని, అక్కడ చదువు రావడం లేదా అని ప్రశ్నించారు. ప్రస్తుత ప్రభుత్వం జిఒ 117 రద్దుకు ప్రయత్నిస్తుందని, విలీన ప్రక్రియను నిలిపివేయాలని కోరారు. ఈ సందర్భంగా గిరిజన సంక్షేమశాఖ మేనేజ్మెంట్లో ఇటువంటి గిరిజన విద్యారంగ వ్యతిరేక నిర్ణయాలు తీసుకురావడం దారుణమన్నారు. ఇప్పటికైనా ఈ నిర్ణయాన్ని విరమించుకొనేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు టి.రమేష్, నాయకులు జ్యోతి, సంజీవనాయుడు, జగన్నాథంనాయుడు, రామకృష్ణ, నాగరాజు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను తెరిపించాలని ఆందోళన

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని గరిసిగుడ్డి పంచాయతీ తాడివలస గిరిజన గ్రామంలోని జిపిఎస్ స్కూల్‌ను వెంటనే తెరిపించి ఉపాధ్యాయులను నియమించాలని కోరుతూ ఆగ్రామ మాజీ వైస్ సర్పంచ్ సేమి బుట్టకయ్య, సేపు చెన్నారావు, పాలిక పెద్దయ్య రాజు స్కూల్ వద్ద గిరిజన విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు, ఆదివాసీ గిరిజన సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో ఆదివారం నిరసన చేపట్టారు. ఈ ధర్నానుద్దేశించి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభించి రెండు నెలలైనా నేటికీ స్కూలు తెరవకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించాలని, లేకుంటే గిరిజన చిన్నారులు చదువుకు దూరమవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే మండలంలో కుంభీవలస, గుమ్మడిగుడ్డివలస, మెట్టవలస, పర్తాపురంతో పాటు అలాగే సాలూరు, మక్కువ, సీతంపేట, భామిని, కురుపాం తదితర ప్రాంతాల్లో జిపిఎస్ స్కూల్‌లను తెరిపించేలా చర్యలు చేపట్టి గిరిజన పిల్లలకు విద్యనందించాలన్నారు. తక్షణమే ఐటిడిఎ పిఒ చొరవ తీసుకొని వెంటనే కౌన్సిలింగ్ జరిపి జిపిఎస్ స్కూల్‌ను తెరిపించి, ఉపాధ్యాయులు నియమించాలని డిమాండ్ చేశారు. మాజీ వైస్ సర్పంచ్ సేవి బుట్టకయ్య మాట్లాడుతూ పిల్లలు చదువులకు దూరమైతే తమ గిరిజన బతుకులు మరి మారవని, దయచేసి అధికారులు వెంటనే స్కూలు తెరిపించి తాడివలస గిరిజన పిల్లలకు విద్యనందించాలని కోరారు. లేకుంటే పార్వతీపురం ఐటిడిఎ వద్ద ఆందోళన చేపడుతామని తెలిపారు. ఈ ఆందోళనలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న గిరిజన విద్యార్థుల తల్లిదండ్రులు

చినుకు పడితే చిత్తడే..

అధ్వానంగా మారిన గిరిజన గ్రామాల రోడ్లు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని గుజ్జువాయి పంచాయతీలో గల మంటికొండ, మర్రిమానుగూడ, నేరడి మానుగూడ, డెప్పిగూడ, డేరింగుపాడు, డాంగూడ, చిన్నంటిజోల, భూగన్నగూడ, తవుడుగుడా గిరిజన గ్రామాలకు రహదారులు చినకుపడితే చిత్తడిగా మారుతున్నాయి. ఎన్నో ఏళ్లుగా ఇదే పరిస్థితి ఉండడంతో గిరిజనులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక సర్పంచ్ హెచ్.నాగేశ్వరరావు, గ్రామస్తులు తమ సొంతంగా కొంత నగదు పోగేసుకొని కొన్ని రోడ్లపై గ్రావెల్, మరికొన్ని రోడ్లపై కంకర వేసి తాత్కాలికంగా రహదారులు బాగు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆ గ్రామ గిరిజనులు మాట్లాడుతూ మేము స్వచ్ఛందంగా కొంత నగదు ఎత్తుకొని, సర్పంచ్ కొంత సహాయం చేయడంతో మా గ్రామాల రహదారులన్నీ తాత్కాలికంగా గుంతలు కప్పి రాకపోకలు సాగిస్తున్నామని, ఇప్పుడు మళ్లీ వర్షాకాలం రావడంతో రహదారులు పాడై గుంతలమయమ య్యావని తెలిపారు. దీంతో రాకపోకలకు అత్యవసర సమయంలో ఆరోగ్యం బాగు లేనప్పుడు డోలీమోతలతో వెళ్లాల్సిన పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయంలో కనీసం పట్టించుకునే నాధుడే కరువయ్యాడని కొత్త ప్రభుత్వంలో అయినా మా గిరిజన ప్రజల ఇబ్బందులను, ప్రజాప్రతినిధులు అధికారులు దృష్టిలో పెట్టుకొని రహదారుల నిర్మాణం చేపట్టి తమ ప్రయాణానికి సురక్షితంగా ఉండేలా చేయా లని కోరుతున్నా మన్నారు.




గొయ్యిలమయమైన గుజ్జవాయికి వెళ్లే రోడ్డు

గ్యాస్ కనెక్షన్‌కు ఆధార్ లింకు ఎప్పుడైనా చేయొచ్చు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక జిసిసి బ్రాంచ్ పరిధిలో గ్యాస్ కలెక్షన్లకు ఆధార లింకు ఎప్పుడైనా చేసుకోవచ్చునని, దీనికి చివరి తేదీ అంటూ ఏది లేదని, గ్యాస్ వినియోగదారులు అపోహలు వీడి తమ గ్యాస్ కనెక్షన్కు ఆధార్ లింకును ఎప్పుడైనా చేసుకోవచ్చని పార్వతీపురం గిరిజన సహకార సంస్థ డివిజన్ మేనేజర్ మహేంద్ర కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, గుమ్మలక్ష్మీపురంలో గత వారం రోజులుగా వైరల్ అవుతున్న వార్త గ్యాస్ కనెక్షన్ కు ఆధార లింకు మరో రెండు రోజుల్లో చేసుకోవాలని, లేదంటే ప్రభుత్వం అందించే ఉచిత గ్యాస్ సిలిండర్లు అందవని ప్రచారం జరుగుతోందన్నారు. కావున అనవసరంగా గ్యాస్ వినియోదారులు తమ సమయాన్ని వృధా చేసుకోవద్దని కోరారు. తమకు ఉన్న గ్యాస్ కనెక్షన్ల లకు ఎప్పుడైనా సరే ఆధారం లింకు అనుసంధానం చేసుకోవచ్చని అన్నారు. పార్వతీపురం పరిధిలో ఉన్న గ్యాస్ వినియోగదారులకు అవగాహన పరచమని అన్ని బ్రాంచి మేనేజర్లకు, సిబ్బందికి ఆదేశాలు జారీచేశామని అన్నారు. అన్ని డిపోల పరిధిలో ఉన్న వినియోగదారులతో విడతల వారీగా ఆధార్ లింకులు అనుసంధానం చేయమని చెప్పమని అన్నారు. అందువలన వినియోగదారులు ఎవరూ ఆందోళన పడకుండా ఉండాలని సూచించారు.



నూతనంగా ఎన్నికైన బయోలజీ జిల్లా ఫోరం కార్యవర్గం

బిటిఎఫ్ ఎన్నిక ఏకగ్రీవం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మన్యం జిల్లాలోని జీవశాస్త్ర ఉపాధ్యాయుల సమావేశంలో కొత్తగా జిల్లా ఫోరం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగినట్లు ప్రధాన సలహాదారు నల్ల బాలకృష్ణారావు తెలిపారు. ఆదివారం పార్వతీపురంలో ఆయన అధ్యక్షతన జరిగిన సమావేశంలో గౌరవాధ్యక్షులుగా చొక్కాపు శ్రీనివాసరావు, అధ్యక్షులుగా చుక్క ప్రసాదరావు, ప్రధాన కార్యదర్శిగా జొన్నాడ సురేష్, ఉపాధ్యక్షులుగా రవికుమార్, రాజా గణేష్, అప్పలనాయుడు, కార్యదర్శులుగా బి.జోగారావు, బి.కాశీవిశ్వనాథం, వి.కృష్ణవేణి, ప్రసన్నకుమార్, కోశాధికారిగా పాత చంద్రమౌళి, మహిళా ప్రతినిధిగా జానకి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా పెంట రామకృష్ణ, గంటా సోమశేఖర రావు ఎన్నికయ్యారు. ప్రధాన సలహాదారులుగా ఎం.భాస్కరరావు, నల్ల బాలకష్ణారావు, సిహెచ్ రామకష్ణ, ఎస్ మహేష్, అకాడమిక్ కౌన్సిల్ సభ్యులుగా సిహెచ్ సత్యనారాయణ, రఘురాం, ఆర్. ఈశ్వరరావు, జి రాజు, సాంకేతిక కమిటీ సభ్యులుగా వంశీకృష్ణ, బలరాం, చిప్పాడ సత్యనారాయణ, మురళి ఎన్నికయ్యారు. ఈ సమావేశానికి విజయనగరం జీవశాస్త్ర ఫోరం ప్రధాన బాధ్యులు బూరి వేణు, సన్యాసినాయుడు, సురేంద్ర, కృష్ణారావు ప్రత్యేక అతిధులుగా హాజరయ్యారు. బయోలాజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం కు జిల్లా కోశాధికారి పాత చంద్రమౌళి రూ.5వేలు విరాళాన్ని అందించారు. వీరికి సభ్యులు అభినందనలు తెలిపారు. కొత్తగా ఎన్నికైన కమిటీ కాలానుగుణంగా తగిన కార్యక్రమాలు చేపట్టాలని సభ్యులలకు సూచించారు.

రెల్లయ్యకు ఘన సన్మానం

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక పోలీస్ స్టేషన్లో ఎఎస్‌గా విధులు నిర్వహిస్తున్న రెల్లయ్య ఉద్యోగోన్నతిపై బదిలీ అయిన సందర్భంగా ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్ఐ ఎస్‌కె ఫక్రుద్దీన్ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మంచికి మారుపేరు మచ్చలేని అధికారిగా రెల్లయ్య పేరు తెచ్చుకున్నందుకు గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ కృష్ణంనాయుడు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పండిట్, పిఇటిలకు జీతాలు చెల్లించాలి


ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

గిరిజన సంక్షేమ పాఠశాలల్లో ప్రమోషన్ పొందిన పండిట్ పిఇటిలకు వెంటనే జీతాలు చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పండిట్, పిఇటి పోస్టులను ప్రమోషన్ ద్వారా ఆరు నెలలు కిందట భర్తీ చేశారన్నారు. అయితే వీరికి ఇప్పటివరకు సుమారు ఆరు నెలలుగా జీతాలు చెల్లించలేదన్నారు. ప్రమోషన్ ఐడిలు, సిఎఫ్ఎంఎస్ సమస్యలు అని వివిధ కారణాలు చూపుతూ సమస్యను పరిష్కరించకుండా జిల్లా, రాష్ట్ర అధికారులు కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఆరు నెలలుగా జీతాలు లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర గిరిజన సంక్షేమ అధికారులు ఈ పొజిషన్ ఐడి పోస్ట్ వివరాలను పరిష్కరించేందుకు సంబంధిత డిడిఒలకు ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. ఇప్పటికైనా డిడిఒ అందరినీ సమావేశపర్చి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఐటిడిఎ పిఒను, డిడిని కోరారు.

చెరువుల పరిరక్షణలో ఎమ్మెల్యే చొరవ అభినందనీయం

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

చెరువుల పరిరక్షణకు స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర చర్యలు చేపట్టడం అభినందనీయమని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మరిశర్ల మాలతి, కృష్ణమూర్తి నాయుడు అన్నారు. చెరువుల పరిరక్షణ సమితి అధ్యక్షులు జాగారపు ఈశ్వరరావు, జిల్లా అధ్యక్షులు వంగల దాలి నాయుడు, ఉపాధ్యక్షులు రేజేటి దయామణి, పట్టణ అధ్యక్షులు శిగడాం భాస్కరరావు తదితరులు ఎమ్మెల్యేను ఆయన క్యాంపు కార్యాలయంలో ఆదివారం కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీటి కొరతకు ప్రధాన కారణం నీటి వనరులైన చెరువులు, గెడ్డలు, కాలువలు తదితరమైనవి ఆక్రమించడమేనన్నారు. వర్షపు నీరు నిల్వ ఉండే చెరువులు, గెడ్డలను ఆక్రమించి పక్కా భవనాలు నిర్మించడం వల్ల నీరు నిల్వలేక, జలచక్రం జరగక, రుతువులు గతి తప్పి ఎండలు అధికమై సకాలంలో వర్షాలు కురవడం లేదన్నారు. ఈ విషయాన్ని అర్థం చేసుకున్న ఎమ్మెల్యే తన తొలి ప్రయత్నం భావితరాలకు భవిష్యత్తు నిచ్చే నీటి వనరులను కాపాడేందుకు కంకణం కట్టుకోవడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భావితరాలకు మనమిచ్చేది కేవలం నీటి వనరులేనని, వాటిని రక్షించేందుకు తన శాయిశక్తుల శ్రమిస్తానని అన్నారు.



మంత్రికి వినతిని అందజేస్తున్న 104 ఉద్యోగులు

మంత్రికి 104 ఉద్యోగుల వినతి

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 104 ఉద్యోగుల సంఘ అధ్యక్షులు డి.ఆనందరావు ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణికి వినతిని అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండు నెలల నుంచి వేతనాలందడం లేదని, ఉద్యోగుల పిఎఫ్ వాటాను యాజమాన్యం కట్టకుండా రెండు వైపులా ఉద్యోగుల నుంచి వసూలు చేస్తున్నారని, గతంలో వలె ప్రభుత్వమే 104 సేవలను నిర్వహించి పిహెచ్‌సిల ద్వారా వేతనాలు అందేలా చూడాలని కోరారు. జిల్లాలో 74 మంది సీనియర్ డ్రైవర్లకు స్లాబ్ సిస్టమ్ ప్రకారం వేతనాలు చెల్లించాలని, ఉద్యోగులకు ఉద్యోగ భద్రతను కల్పించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చప్ప ప్రసాదరావు, కోశాధికారి మువ్వల జగదీశ్, ఉపాధ్యక్షులు కాశీ విశ్వస్వరరావు సభ్యులు పాల్గొన్నారు.

నాయుడు గారు.. 'దారి 'చూపారు..!

ప్రజాశక్తి - మక్కువ

మండల కేంద్రమైన మక్కువలోని జన్ని వీధి ప్రజలకు నీలాటి రేవు సౌకర్యం లేక ఏళ్ల తరబడి అవస్థలు పడుతున్నారు. ఈ విషయంపై స్థానిక మహిళలు టిడిపి సీనియర్ నాయకులు మావుడి ప్రసాదరావు నాయుడు వద్ద తమ గోడు వినిపించారు. దీంతో ఆయన స్పందించి తక్షణమే తమ సొంత డబ్బులు వెచ్చించి జెసిబిని ఏర్పాటు చేసి జన్ని వీధి నుంచి సువర్ణముఖి నది వరకు సుమారు నాలుగు మీటర్ల వెడల్పున రహదారి ఏర్పాటు చేశారు. రహదారికి ఇరువైపులా ఉన్న కూరగాయలు పండించే రైతులను ఒప్పించి రహదారి ఏర్పాటు చేయడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. ప్రసాదరావునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.



రోడ్డు పనులు చేస్తున్న జెసిబి